రేపు ఉచిత మెగా వైద్యశిబిరం

మీడియాతో మాట్లాడుతున్న వికారాబాద్ క్లబ్ సభ్యులు

వికారాబాద్ , నవంబర్ 28 : వికారాబాద్ క్లబ్ (క్లబ్ ఫంక్షన్ హాల్) ఆవరణలో శనివారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు జి.నర్సింహులు, ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ వికారాబాద్ అధ్యక్షుడు లవకుమార్ తెలిపారు. గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ...మహవీర్ వైద్యశాల సౌజన్యంతో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ముఖ్య అతిథులుగా స్పీకర్ ప్రసాద్‌కుమార్, కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి పాల్గొంటారన్నారు. అవసరమైన వారు క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని వికారాబాద్ క్లబ్ సభ్యులు కోరారు.

సమగ్రశిక్షా ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలి



ఎంఈవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సమగ్రశిక్షా ఉద్యోగులు

కులకచర్ల, నవంబర్ 28 : సమగ్రశిక్షా ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి వెంటనే క్రమబద్ధీకరించాలని సమగ్రశిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గాంగ్యానాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఎంఈవో కార్యాలయం ఎదుట సమగ్రశిక్షా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం సమగ్రశిక్షా ఉద్యోగులకు న్యాయం చేయాలని అన్నారు. తమ సమస్యల సాధనకోసం త్వరలో మెరుపు సమ్మెకు సిద్ధమన్నారు. తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖలో 21 సంవత్సరాల నుంచి తీవ్రమైన శ్రమ దోపిడికి గురవుతున్నామని, ఎంఆర్పీ, సీఆర్పీ, కేజీబీవీ, యూఆర్ఎస్, డీపీవో స్థాయిలో ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కులకచర్ల, చౌడాపూర్ మండలాల సమగ్రశిక్షా ఉద్యోగులు ఎస్ఓ దేవి, జ్యోతి, సంతోశ్‌రెడ్డి, సీఆర్పీలు కృష్ణయ్య, మహిపాల్, విజయ్‌కుమార్, రాజు, మెసెంజర్ రాములు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

పుట్టిన రోజున ఉచితంగా పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న కానిస్టేబుల్ రామచంద్రయ్య

కులకచర్ల, నవంబర్ 28 : మండల పరిధిలోని ఇప్పాయిపల్లి గ్రామంలో ఆరవ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్థానిక నాయకుడు మల్లయ్యగౌడ్ ఆధ్వర్యంలో ప్లేట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన కానిస్టేబుల్ రామచంద్రయ్య కుమారుడు వర్షిత్‌గౌడ్ పుట్టిన రోజు సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు ఆల్‌ఇన్‌వన్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రంగయ్య, పాఠశాల కమిటీ చైర్మన్ సుధారాములు, ఉపాధ్యాయులు కిరణ్‌కుమార్, సరిత, రుక్మిణి, శివశంకర్, శ్యాంసుందర్, స్థానిక నాయకులు యాదయ్య, మహమూద్, మాజీ సర్పంచ్ నర్సింహులు, రఘుగౌడ్, ఆనంద్, రాంజీ, శంకర్, పసుల మల్లయ్య, గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు వాడల బాలచంద్రయ్య, బాలయ్య, మల్లయ్య, కిష్టయ్య, నర్సింహులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి

చెంగోల్‌లో వరి కొనుగోలుకేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

తాండూరు రూరల్, నవంబర్ 28: వరికొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. గురువారం తాండూరు మండలం, చెంగోల్ గ్రామంలోని వరికొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకు వచ్చే రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తామన్నారు. ఆయన వెంట తహసీల్దార్ తారాసింగ్ ఉన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

విద్యుత్ అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల

సైదాబాద్, నబంబర్ 28: పెండింగ్‌లో ఉన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి చొరవచూపాలని విద్యుత్ శాఖ అధికారులను మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల ఆదేశించారు. గురువారం పాతబస్తీ ఫంజేషాలోని క్యాంపు కార్యాలయంలో విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో నెలకొన్న విద్యుత్ సమస్యలను తొలగించటానికి తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ఇప్పటికే పెండింగ్‌లో కొనసాగుతున్న పనుల పురోగతిపై, నూతన పనుల గురించి ఆరా తీశారు. ప్రజలకు విద్యుత్ ఇబ్బందులను తొలగించటానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని, అదే విధంగా పలు ప్రాంతాల్లో బంచ్ కేబుళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. స్టీల్ బ్రిడ్జి నిర్మాణంతో పలు ప్రదేశాల్లో విద్యుత్ లైన్ల మార్చే పనులను వేగవంతం చేయాలని, అలాగే ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్మాన్‌ఘడ్ సబ్ డివిజన్ డీఈ విష్ణువర్ధన్ రెడ్డి, ఏడీఈ వినోద్, శోభన్‌బాబు, ఏఈ శ్రీనివాస్ రెడ్డి, నియోజకవర్గం పరిధిలోని వివిధ డివిజన్ల మజ్లిస్ పార్టీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల గొంతుక పూలే

వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించిన నాయకులు

పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ సంఘం నేతలు

యాలాల మండల కేంద్రంలో..

తాండూరు, నవంబర్ 28: మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని పురస్కరించుకొని గురువారం తాండూరు పట్టణంలో బీసీ సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంఘం నాయకుడు రాజ్‌కుమార్ మాట్లాడుతూ పూలే సమాజంలోని కులమతాల వివక్షతను, అన్యాయాలను రూపుమాపడానికి కృషి చేశారని పేర్కొన్నారు. తన భార్య సావిత్రీబాయితో కలిసి దేశంలో స్త్రీ విద్యకు మార్గదర్శకులుగా వ్యవహరిస్తూ మహిళల చదువుకు, హక్కులకోసం నిరంతరం పోరాటం చేశారని పేర్కొన్నారు. 1873లో సత్యశోధక సమాజాన్ని స్థాపించి మానవ హక్కుల కోసం, అణగారిన వర్గాల సాంఘిక న్యాయం కోసం దానిని అంకితం చేశారని తెలిపారు. నేటి తరం పూలేను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

వికారాబాద్: పూలే విగ్రహాన్ని వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని ధర్మ సమాజ్ పార్టీ వికారాబాద్ జిల్లా కో కన్వీనర్ మల్లి కార్జున్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పూలే వర్ధంతి సందర్భంగా చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ సమసమాజాన్ని నిర్మించడమే తమ పార్టీ లక్ష్యం అని వారు తెలిపారు. మహాత్మా జ్యోతి రావు పూలే చేసిన సామాజిక ఉద్యమ స్ఫూర్తితో ఆయనను గౌరవించుకొని ఆయన విగ్రహాన్ని, అలాగే భారత దేశ మొదటి ఉపాధ్యాయురాలు అయిన మాతా సావిత్రీ బాయి పూలే విగ్రహాలను వికారాబాద్‌లో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

యాలాల: పూలే వర్ధంతిని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య ఆధ్వర్యంలో యాలాల మండల కేంద్రంలో నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అణచివేతకు గురవుతున్న బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఆత్మస్థైర్యం కలిగించి వారి హక్కుల కోసం పోరాడి, సాధికారత కల్పనకు కృషి చేసిన మహనీయుడని కొనియాడారు.

డ్రగ్స్ రహిత సమాజం దిశగా కృషి చేయాలి

పరిగి, నవంబర్ 28: డ్రగ్స్ వాడకం, దుష్పరిణామాలపై విద్యార్థులు అవగాహన కలిగిఉండాలని, డ్రగ్స్ రహిత సమాజం దిశగా అందరూ కృషి చేయాలని పరిగి డీఎస్పీ ఎన్.శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం పరిగిలోని ఇండస్ వ్యాలీ పాఠశాలలో జరిగిన యాంటీ డ్రగ్స్ క్యాంపెయిన్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే విద్యార్థులు అనేక అంశాలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. డ్రగ్స్ వాడడం వల్ల జీవితాలు నాశనమవుతున్నాయని, వాటి ప్రభావంపై విద్యార్థులకు అవగాహన పెంపొందించడంతోపాటు తల్లిదండ్రులను సైతం చైతన్యవంతులను చేయాల్సిన అవసరం ఉందన్నారు. తమ పిల్లలు ఏమి చేస్తున్నారనేది తల్లిదండ్రులు నిత్యం గమనిస్తూ ఉండాలని డీఎస్పీ సూచించారు. ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఎస్ఐ దయాసాగర్ మాట్లాడుతూ డ్రగ్స్ వాడడం వల్ల అనేక అనర్థాలు ఏర్పడతాయని, జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. వాటి ప్రభావంతో ఇతర అనర్థాలు చోటు చేసుకుంటాయని చెప్పారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి గోపాల్, డాక్టర్ రాఘవేందర్‌రెడ్డి, పాఠశాల డైరెక్టర్ వీరేశం, ప్రిన్సిపాల్ సునీల్, ట్రస్మా కార్యదర్శి వెంకట్రాంరెడ్డి, జిల్లా కోశాధికారి ప్రకాశ్, విద్యార్థులు పాల్గొన్నారు

సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాస్

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

వికారాబాద్, నవంబర్ 28 : ఆర్థిక ఇబ్బందులతో చెరువులో దూకి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మోమిన్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. ఎస్సై అరవింద్ కథనం ప్రకారం.. టేకులపల్లి గ్రామానికి చెందిన పుల్‌మద్ది కృష్ణ (24) కుటుంబ పోషణకు చేసిన అప్పులు చేశాడు. నాలుగు నెలల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి టేకులపల్లి గ్రామాన్ని విడిచి తల్లిదండ్రులు, భార్యతో శంకర్‌పల్లి మండలంలోని టంగుటూరుకు వెళ్లి ఒక ఫామ్ హౌస్‌లో పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం 10:30 గంటలకు వేరే ఊరిలో పనికి వెళ్తున్నానని కుటుంబ సభ్యులతో చెప్పాడు. టేకులపల్లి గ్రామ చివరన ఉన్న అయ్యన్న పెద్ద చెరువు కట్ట మీద బైకు ఉంచి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మర్పల్లి ప్రభుత్వాసుప త్రిలో పంచనామా నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి తండ్రి పుల్‌మద్ది యాదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు

అనతి కాలంలోనే మెట్రోకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు

ఎల్ అండ్ టీ సీఈఓ ఎండీ కేవీబీ రెడ్డి

ఎల్ అండ్ టీ ఆధ్వర్యంలో మెట్రో ఏడో వార్షికోత్సవం

సిటీబ్యూరో, నవంబర్ 28(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మెట్రో అనతి కాలంలోనే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపును సొంతం చేసుకుందని, ప్రపంచంలోనే అతి పెద్ద పీపీపీ ప్రాజెక్టు నిర్మించిన ఘనత ఎల్ అండ్ టీకి దక్కిందని ఎల్ అండ్ టీ సీఈఓ ఎండీ కేవీబీ రెడ్డి అన్నారు. ఎల్ అండ్ టీ ఆధ్వర్యంలో వార్షిక వేడుకలను అమీర్‌పేట్ మెట్రో స్టేషన్‌లో గురువారం నిర్వహించారు. హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏడేళ్ల కాలంలో దిగ్విజయంగా మెట్రో సేవలతో అందరికీ చేరువయ్యామన్నారు. కేవలం ఇదొక ప్రజా రవాణా వ్యవస్థ మాత్రమే కాదని, హైదరాబాద్ ఎకనామిక్ గ్రోత్‌లోనూ కీలక పాత్ర పోషించిందన్నారు. సామాజిక అభివృద్ధితో పాటు, పర్యావరణ సుస్థిరత సాధ్యమైందన్నారు.

అదే విధంగా నగరంలో ట్రాఫిక్ సమస్య అనూహ్యంగా తగ్గిందని, దీంతో గాలి నాణ్యత పెరిగిందన్నారు. ఎన్నో సవాళ్లను అధిగమించి, మరెన్నో సమస్యలకు ఇంజనీరింగ్ నైపుణ్యాలతో పరిష్కారం చూపిన ఏకైక పీపీపీ వెంచర్‌గా మెట్రో నిలుస్తుందని ఎల్ అండ్ టీ ఎండీ కేవీబీ రెడ్డి తెలిపారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్మించిన మెట్రో హైదరాబాద్ భవిష్యత్తుకు దిశా నిర్దేశం చేసిందని, సుస్థిర అభివృద్ధిలో తమ భాగస్వామ్యం కూడా ఉందన్నారు. కాగా, ఏడేళ్లలో సగటున 4.75 లక్షల మందిని గమ్య స్థానాలకు చేర్చామని, అత్యధికంగా 5.63 లక్షల మంది ప్రయాణించగా, ఇప్పటివరకు 63.5 కోట్ల మంది మెట్రో వినియోగించుకున్నారు. నిత్యం 25,600 కిలోమీటర్లు ప్రయాణిస్తూ, 184 మిలియన్ లీటర్ల శిలాజ ఇంధనాలను పొదుపు చేశామన్నారు. దీంతో 424 మిలియన్ కిలోల కర్బన ఉద్గారాలు తగ్గినట్లుగా పేర్కొన్నారు. అదే విధంగా మెట్రో డిపోలు, స్టేషన్లలో ఏర్పాటు చేసిన సోలార్ పవర్ స్టేషన్లతో 12 శాతం మెట్రో విద్యుత్ అవసరాలు తీరుతున్నట్లుగా ఎల్ అండ్ టీ వర్గాలు పేర్కొన్నాయి.

ఎంఫిల్ ఇన్ రిహాబిలిటేషన్ సైకాలజీ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 28: ఓయూ పరిధిలోని ఎంఫిల్ ఇన్ రిహాబిలిటేషన్ సైకాలజీ కోర్సు పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు రెండో సంవత్సరం (పార్ట్-2) రెగ్యులర్ పరీక్ష ఫీజును వచ్చే నెల 11వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్టు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

రక్తదానం..మహాదానం

ఆర్కేపురం, నవంబర్ 28 : రక్తదానం మహాదానమని ఫైన్ వేవ్ చారిటబుల్ సొసైటీ అధ్యక్షుడు డా.ముస్తఫా అన్నారు. మంగళవారం అరోరా పీజీ కళాశాలలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రక్తదానం చేసేందుకు ముందుకొచ్చారు.

ఆన్‌లైన్‌లో ఏఐ డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ కోర్సుల శిక్షణ

కాచిగూడ, నవంబర్ 28: కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో ఏఐ డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, బిగ్ డేటా కోర్సులకు తెలంగాణ వ్యాప్తంగా ఆన్‌లైన్ శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నేషనల్ స్కిల్ అకాడమీ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ సాయి శ్రీమాన్ రెడ్డి తెలిపారు. కాచిగూడలో గురువారం ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన 100కు పైగా అంతర్జాతీయ సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్ కోర్సులు, ఆర్కిటెక్, సెక్యూరిటీ విభాగం, డేటా సైన్స్, బిగ్ డేటా, క్లౌడ్ కంప్యూటర్, జావా, ఒరాకిల్ కోర్సుల్లో ఆన్‌లైన్‌లో 2 నుంచి 6 నెలల శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్, డిప్లమా, పీజీ, ఇంజినీరింగ్ పూర్తిచేసిన యువకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు ఫోన్ నం. 95058 00050, www.nationalskill academy.inలో సంప్రదించవచ్చని కోరారు.

నూనె గింజల నూతన ఆవిష్కరణలు మరిన్ని అవసరం

ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ డా.శర్మ

సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ జనరల్ డా.శర్మ

వ్యవసాయ యూనివర్సిటీ, నవంబర్ 28: దేశ వ్యాప్తంగా నూనె గింజల సాగు మరింత అవసరమని, అందుకు అనుగుణంగా పరిశోధనలు జరగాలని జాతీయ నూనె గింజల పరిశోధనా సంస్థ (ఐసీఏఆర్ - ఐఐఓఆర్) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డా. టీఆర్ శర్మ అన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ జాతీయ నూనె గింజల పరిశోధనా కేంద్రం సమావేశం మందిరంలో గురువారం ఏర్పాటు చేసిన నూతన నూనెగింజల రకాల ఆవిష్కరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పలు అధిక దిగుబడులను ఇచ్చే వంగడాలను అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. భారతీయ నూనె గింజల పరిశోధనా సంస్థ డైరెక్టర్ డా. మాథూర్ అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మూడు దశాబ్దాలుగా జీవ నియంత్రణ సాంకేతికత రంగంలో వివిధ ట్రైకోడెర్మా, బీటీ సంబంధింత ఉత్పత్తులను అభివృద్ధి చేయడంలో దేశ వ్యాప్తంగా మనకు మంచి పేరు లభించిందన్నారు. ఈ సాంకేతికతను దేశ వ్యాప్తంగా దాదాపు 60కి పైగా పరిశ్రమలకు అందజేశారన్నారు. ప్రస్తుతం మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా అధిక ఉష్ణోగ్రత, బెట్ట పరిస్థితులకు నుంచి కాపాడుతున్నాయన్నారు. పరిశోధనా సంస్థ మొక్కలకు మేలుచేసే ట్రైకోడెర్మా వంటి వివిధ సూక్ష్మ జీవులతో పాటు మొక్కల పెరుగుదలకు దోహదపడే ఇతర సూక్ష్మ పోషకాలు, సీడ్ కోటింగ్ విధానాన్ని ఆవిష్కరణకు పేటెంట్ లభించిందన్నారు. ప్రధాన శాస్త్రవేత్తలు డా.కేవీబీ పూర్ణ చంద్రిక, డా. ఆర్డీ ప్రసాద్ కృషి అభినందనీయమన్నారు. వీటి వినియోగాన్ని రైతు స్థాయిలో పెంచేందుకు కృషి చేస్తామన్నారు.

బీఫార్మసీ పరీక్ష ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 28: ఓయూ పరిధిలోని బీఫార్మసీ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఫార్మసీ (పీసీఐ) మొదటి, రెండు, మూడు, నాలుగు, అయిదు, ఆరో సెమిస్టర్ల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ఎన్నికల నిర్వహణపై విద్యార్థులకు అవగాహన

కులకచర్ల, నవంబర్ 28: మండల పరిధిలోని సాల్వీడ్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఎన్నికల నిర్వహణ, పోలింగ్ విధానం, ఓటుహక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడు వెంకటేశం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. విద్యార్థులు నామినేషన్లు దాఖలు చేయడం, విత్‌డ్రాచేయడం, ప్రచారం చేయడం, ఎన్నికల ఓటింగ్‌లో పాల్గొనడం, ఓట్ల లెక్కింపు, విజేతలను ప్రకటించడం వరకు నమూనా ఎన్నికలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కులకచర్ల ఎంఈవో హబీబ్ అహ్మద్ హాజరై మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అనేది చాలా విలువైనదన్నారు. ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకొని ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామచందర్, ఉపాధ్యాయులు మన్నన్, స్వయం ప్రకాశ్, తులసీనాయక్, రమేశ్‌కుమార్, ప్రసాద్, కేశవ్, సంతోషి పాల్గొన్నారు

వైభవంగా పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

కొడంగల్, నవంబర్ 28: మండలంలోని పెద్దనందిగామ గ్రామంలో పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారి ఊరేగింపు కన్నుల పండువలా జరిగింది. ప్రత్యేక పూజలతో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, గ్రామ మాజీ సర్పంచ్ సంజీవ్‌రెడ్డితో పాటు సత్యనారాయణ, మల్లేశం, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హుడా లేఅవుట్‌లో పార్క్ లేదు

సిటీబ్యూరో, నవంబర్ 28(నమస్తే తెలంగాణ): బంజారాహిల్స్‌లోని హుడా హైట్స్ లేఅవుట్ విషయంలో స్థానికులు లేవనెత్తిన అనుమానాలకు హెచ్ఎండీఏ అధికారులు స్పందించారు. 12 ఎకరాల విస్తీర్ణంలో రెండో దశ లేఅవుట్‌కు ఏర్పాట్లు చేస్తుండగా... ఇందులో కొన్ని ప్లాట్లను విక్రయించేందుకు హెచ్ఎండీఏ సన్నాహాలు చేస్తున్నది. అయితే 1993లోనే హైదరాబాద్ రెవెన్యూ అధికారులు హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి భూములను కేటాయించారని, అందులో భాగంగా నిర్మించిన లేఅవుట్‌ను మొదటి దఫా వేలం వేయగా, మిగిలిన ప్లాట్లను విక్రయించేందుకు వీలుగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఇందులో స్థానికులు చెబుతున్నట్లుగా పార్క్ స్థలం లేదని హెచ్ఎండీఏ ఆమోదిత లేఅవుట్‌లో ప్లాట్లుగానే ఉందని, దాని ప్రకారమే రోడ్లు, డ్రైనేజీ, ఇతర సౌకర్యాల కోసం డెవలప్‌మెంట్ కార్యక్రమాలను చేపట్టినట్లుగా హెచ్ఎండీఏ పేర్కొంది.

దీక్షాదివస్ విజయవంతం చేయాలి

ధారూరు/ మర్పల్లి నవంబర్ 28: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 9: 00 గంటలకు నిర్వహించే దీక్షాదివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ ధారూరు మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మర్పల్లి మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి గురువారం వేర్వేరు ప్రకటనల్లో కోరారు.

భద్రేశ్వర ఆలయ పునరుద్ధరణ కమిటీ నియామకం

తాండూరు,నవంబర్23: తాండూరు పట్టణ ప్రసిద్ధ భావిగి భద్రేశ్వర దేవాలయ పునరుద్ధరణ కమిటీని నియమిస్తూ గురువారం దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. పునరుద్ధరణ కమిటీలో పటేల్ కిరణ్ కుమార్, జాక సంగమేశ్వర్, జొల్లు రోహిణి, శెట్టి సురేశ్, గాండ్ల వీరన్న, ప్రశాంత్ కుమార్, గడ్డి కిరణ్‌లను నియమించారు.

అంబేద్కర్ విశ్వవిద్యాలయం బీఎస్సీ రెండో సెమిస్టర్ ప్రయోగ పరీక్షలు

వికారాబాద్, నవంబర్ 28 : అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం బీఎస్సీ రెండో సెమిస్టర్ ప్రయోగ పరీక్షలు డిసెంబర్ 4 నుంచి 7 వరకు నిర్వహించనున్నట్లు ఎస్ఏపీ కళాశాల ప్రిన్సిపాల్ మందారిక, వికారాబాద్ అధ్యయన కేంద్రం సమన్వయ కర్త మల్లారెడ్డి గురువారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. వికారాబాద్ ఎస్ఏపీ కళాశాలలో నిర్వహించే ప్రాక్టికల్ పరీక్షలకు... విద్యార్థులు రికార్డు బుక్‌తో పాటు అవసరమైన పరికరాలను తీసుకు రావాలని సూచించారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయన్నారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు అర గంట ముందుగానే చేరుకోవాలన్నారు.

PUBLIC NOTICE

It is hereby informed to all the General Public that our client intends to purchase and entered agreement of sale to the original owner vide Doc No. 2444/1988 and paid part payment to the open plot No. 24 admeasuring 267 Square Yards or 223 Sq.Mtrs in Survey No. 270 and 271 situated at Pedda Amberpet Village Abdullapurmet Mandal,Ranga Reddy District within the following boundaries from Sri. S.Rahamathulla, S/o. Syed Akbar, Occ: Retd. RTC Employee, R/o. H.No. 13-3-581,Imampura Janab Galli, Jiyaguda, Hyderabad. **North:** Plot No. 29, **South:** 25' Wide Road, **East:** Plot No. 23, **West:** Plot No. 25, person or persons having any right claim, right, titile or interest on the said property may contact the undersigned with relevant documents of title within (7) days hereof. Failing which our client will complete the transaction of purchase and the objections, if any raised thereafter shall not be valid and deemed to have been waived.
Hence this Public Notice.
Sd/- VEERABABU GANDU,
Advocate
Plot No. 1, H.No. 2-63/1,
Tulasivanam Colony,
Munaganoor Village,
Abdullapurmet Mandal,
Ranga Reddy District,
Phone: 9030088996.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, MOHAMMED SHAFI, S/o. Mohd Mastan Ali, R/o. 1-5-144/21P, Indira Nagar, Tandur, Vikarabad Dist., T.S. have Changed My Name as MOHD SHAFEE.
NT-Vamshi

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుక